లక్ష్మీనరసింహుడికి నిత్యోత్సవాలు


స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్12: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో శుక్రవారం నిత్యోత్సవాలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలోని కల్యాణ మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హవనం జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి గజవాహన సేవ నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవంలో అత్యంత వైభవంగా సాగింది. సాయంత్రం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నేత్ర పర్వంగా నిర్వహించారు. స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. అనుబంధ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సీతారామచంద్ర స్వామి వసంతోత్సవ వేడుకలు శాస్త్రోక్తంగా సాగుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. 16 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 46,39,078 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

దళితులంతా ఏకమై బీజేపీ మెడలు వంచాలి

- దళితుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు దయాకర్

యాదగిరిగుట్ట, ఏప్రిల్12: బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని అమలు చేయకుండా దళితులపై వివక్ష చూపుతున్న బీజేపీని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని దళితుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కశపాక దయాకర్, కార్యదర్శి ఎర్రోళ్ల లింగస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని విర్రవీగుతున్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అంబేడ్కర్ అభయ హస్తం పేరిట దళితులకు రూ.12 లక్షల నగదు అందించాలన్నారు. భూమిలేని దళిత నిరుపేదలకు మూడెకరాల భూమిని కేటాయించాలని, వారికి ఇండ్ల స్థలాలు కేటాయించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం దళిత హక్కుల పోరాట సమితి మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్లుగా మీసాల దాసు, బోద సాయిలు, కో కన్వీనర్లుగా మద్దూరు భాగ్యమ్మ, కిష్టమ్మ ఎన్నికయ్యారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, సహ కార్యదర్శి పి. మహేందర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరంటి రాములు పాల్గొన్నారు.

వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ సైదులు

గ్రామ వలంటీర్లకు అవగాహన

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 12 : గ్రామాల్లో నేరాలు, దొంగతనాల నియంత్రణ కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో వలంటీర్లను నియమించారు. శుక్రవారం మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన వలంటీర్లకు ఏఎస్ఐ సైదులు అవగాహన కల్పించారు. వలంటీర్లు వంతుల వారీగా గ్రామంలో గస్తీ తిరుగాలని, కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని కోరారు.

కూరెళ్లలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 12 : మండలంలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారే గానీ కొనుగోళ్లు చేపట్టడం లేదని, వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం, జిల్లా నాయకులు రచ్చ గోవర్ధన్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కూరెళ్ల, రాఘవాపురం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో రైతులు పోసిన ధాన్యం రాశులను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకొచ్చి 15 రోజులు అవుతున్నా నేటికీ కాంటా వేయడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. వారి వెంట నాయకులు యాదయ్య, రాములు, యాదిరెడ్డి, బీరయ్య, కవిత, అంజయ్య, రైతులు ఉన్నారు.

రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్

బీబీనగర్, ఏప్రిల్ 12 : ప్రస్తుతం రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొనడంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్ట పోయారని, వారికి పరిహారం అందించి ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని జమీలాపేట గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలనపై ప్రజల్లో నిరసన వ్యక్తమవుతుందన్నారు. గ్రామాల్లో కరెంటు సమస్య తలెత్తుతున్నా, అంతర్గత సమస్యలతో పాలన కుంటుపడుతున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులు యాసంగి వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి పది రోజులు గడుస్తున్నా కేంద్రం నిర్వాహకులు కాంటా వేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకొని కొనుగోళ్లు ప్రారంభించాలని కోరారు. ఆయన వెంట పార్టీ మండల మాజీ కార్యదర్శి బండారు శ్రీరాములు, మండల కమిటీ సభ్యులు రేసు రామచంద్రారెడ్డి, ఎర్రనోళ్ల లక్ష్మయ్య, పొన్నగంటి నరసింహ, చినాల ఎట్టయ్య, బార్ల సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

బీసీ యువజన సంఘం మండలాధ్యక్షుడిగా కృష్ణ


నియామకపత్రం అందుకుంటున్న కృష్ణ

రాజాపేట, ఏప్రిల్ 12 : బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడిగా మండలంలోని దూదివెంకటాపురం గ్రామానికి చెందిన మంగ కృష్ణను నియమించినట్లు సంఘ రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం కృష్ణకు నియామకపత్రం అందించి మాట్లాడారు. బీసీల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ హనుమంతు కె. జెండగే

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 12 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె. జండగే అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో భువనగిరి, ఆలేరు, జనగాం, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం (7) అసెంబ్లీ సెగ్మెంట్ల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో సమావేశమైన ఆయన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతున్నందున జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నట్లు చెప్పారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని, 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన అప్‌డేటెడ్ ఓటరు జాబితాలతో అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయాల్లో కూడా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని, ఓటరు జాబితాలతో వివరాలు అందించాలన్నారు. నామినేషన్‌కు సంబంధించిన అన్ని ఫారాలపై అభ్యర్థులకు సాయం అందించాలన్నారు. పోటీచేసే అభ్యర్థి, ప్రపోజర్ల ఓటుహక్కు ఉన్నదీ లేనిది చూడడం, నామినేషన్ పత్రాల పూరింపు, జతచేయాల్సిన పత్రాలపై అవగాహన కల్పించడం వంటివి చేయాలన్నారు. స్టాటిస్టికల్ సర్వైవల్ టీమ్‌కు కావాల్సిన వసతులను కల్పించాలని, టీమ్‌లు నిర్వహించే రిజిస్టర్లు సరిగా ఉండేలా పర్యవేక్షించాలని, చెక్‌పోస్ట్‌లను తరచూ పరిశీలిస్తుండాలని సూచించారు. టీమ్‌ల షిఫ్ట్ వారి డ్యూటీలను తనిఖీ చేయాలని, సిబ్బందికి ఐడీ కార్డులు ఉండాలన్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు తరచూ అన్ని టీమ్‌లతో సమావేశమై ఎప్పటికప్పుడు పనితీరు పరిశీలిస్తుండాలని, సీజర్ సంబంధించి వస్తువులు, నగదు స్వాధీనం చేసుకొనే విషయంలో ఎన్నికల నిబంధనలను అమలు చేయాలని, వీడియో రికార్డింగ్ తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. సభలు, సమావేశాలు, ర్యాలీలకు సంబంధించి సువిధ ద్వారా అనుమతి ఇచ్చిన వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలనిని సూచించారు. ఎన్నికల నిర్వహణ మెటీరియల్‌పై స్పష్టమైన అవగాహన ఉండాలని, రికార్డుల ప్రకారం పూర్తిపేరు మెటీరియల్ పొందాలని సూచించారు. ఫామ్ 6, 7, 8 దరఖాస్తులు పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. ఈవీఎంల కోసం స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేసుకోవాలని, ఫైర్ ప్రూఫ్ వంటి భద్రతా చర్యలు పటిష్టంగా చేపట్టాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లలో అన్ని ఏర్పాట్లు చేయాలని, అందుకు కావాల్సిన శిక్షణ, అవగాహన అందించాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లకు సంబంధించి వెబ్ కాస్టింగ్ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్లలో వసతులు తప్పనిసరిగా ఉండాలని, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని సూచించారు. సమావేశంలో జనగాం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి. బెన్‌షాలోమ్, భువనగిరి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అమరేందర్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు డి.సుబ్రహ్మణ్యం, పూర్ణచందర్, బీఎస్. లత, డి.కొమరయ్య, కె.అనంతరెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, తాసీల్దార్లు పాల్గొన్నారు.

యాదగిరి గుట్ట ఆలయ ఏఈఓ, పర్యవేక్షకుడికి మెమోలు

జారీకి ఈఓ భాస్కర్‌రావు ఆదేశాలు

యాదగిరిగుట్ట, ఏప్రిల్12: యాదగిరిగుట్ట దేవస్థాన ఏఈఓ జె. కృష్ణ, పర్యవేక్షకుడు సురేందర్‌రెడ్డికి మెమోలు జారీ చేయాలని శుక్రవారం ఈఓ భాస్కర్‌రావు ఆదేశించినట్లు సమాచారం. భక్తులు ఆలయం నుంచి బయటకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన మూడో క్యూ లైన్ వద్ద సుమారు 30 మంది భక్తులు మెట్లపై కూర్చొని ఉండగా వారిని గమనించిన ఈఓ భాస్కర్‌రావు అక్కడి నుంచి వెళ్లాలని వారికి విజ్ఞప్తి చేశారు. దాంతో భక్తులకు ఈఓకు మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. కొంత మంది భక్తులు వివాహ ఆహ్వాన పత్రికను స్వామివారి వద్ద ఉంచి పూజలు నిర్వహించిన అనంతరం ముఖ మండపంలోనే పత్రికల పంపిణీ కార్యక్రమం చేపట్టి భక్తులకు ఆటంకం కలిగించారని సమాచారం. ఇంత జరుగుతున్నా విధుల్లో ఉన్న దేవస్థానం ఏఈఓ జె. కృష్ణ, సూపరింటెండెంట్ సురేందర్‌రెడ్డి పట్టించుకోకపోవడంతో ఈఓ వారిని మందలించినట్లు సమాచారం. ఇద్దరికి మెమోలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారని, దాంతో వారికి నేడో, రేపో మెమోలు జారీ కానున్నట్లు సమాచారం.

సంస్థలోని శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న చిన్నారెడ్డి

స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీగా రామానంద తీర్థ సంస్థ

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 12 : స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీగా రామానంద తీర్థ గ్రామీణ సంస్థను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని, యువతకు గొప్ప వరమని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం భూదాన్ పోచంపల్లి శివారు జలాల్‌పూర్ గ్రామంలో ఉన్న రామానంద తీర్థ గ్రామీణ సంస్థను ఆయన సందర్శించారు. సంస్థ శిక్షణ కార్యక్రమాలు, ప్రయోగశాలలు, తరగతి గదులు, విద్యార్థుల హాస్టల్‌ను పరిశీలించారు. అనంతరం సంస్థ డైరెక్టర్ లక్ష్మి, సిబ్బందితో సమావేశమయ్యారు. త్వరలో 30 లక్షల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రభుత్వ పరంగా కల్పించనున్నట్లు చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఉచిత శిక్షణతోపాటు స్టైఫండ్ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ నోడల్ కేంద్రాలు, 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

మార్కండేశ్వరాలయంలో ఆత్మజ్ఞాన సదస్సు

ప్రవచనాలు ఇస్తున్న స్వామీజీలు

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 12: పట్టణ కేంద్రంలోని మార్కండేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆధ్యాత్మిక భక్త సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మజ్ఞాన సదస్సు నిర్వహించారు. కర్నూలు జిల్లాలోని అమ్మ ఒడి ఆశ్రమ నిర్వాహకురాలు మాతా అనంతగిరి, కృష్ణా జిల్లా పెనమలూరు పరమాత్మానంద ఆశ్రమం పీఠాధిపతి ప్రకాశానందగిరి పాల్గొని ప్రవచనాలు చేశారు. ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సకల జీవరాశుల్లో మానవజన్మ పవిత్రమైందని, మానవ జన్మను సార్థకం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక భక్త సమాజం అధ్యక్షుడు భారత పురుశోత్తం, ఉపాధ్యక్షుడు చక్రాల నరసింహ, ప్రధాన కార్యదర్శి నోముల అశోక్, ప్రతినిధులు కటకం తుకారాం, పుప్పాల నాగేశ్వర్, సీతా సత్యనారాయణ, సుంకి వెంకటేశం, చిట్టి పోలు గోవర్ధన్, కొంక వీరేశం, భక్తులు పాల్గొన్నారు.

గూడ మధుసూదన్ మృతికి పలువురి సంతాపం

గుండాల, ఏప్రిల్ 12: జై గౌడ ఉద్యమ సంఘం రాష్ట్ర నాయకులు, బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నియోజకవర్గ నాయకుడు గూడ మధుసూదన్ గౌడ్ గురువారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం సుద్దాల గ్రామంలో నిర్వహించారు. పలువురు ప్రముఖులు మధుసూదన్‌గౌడ్ పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి, సూదగాని హరిశంకర్‌గౌడ్, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.ఖలీల్, పీఏసీఎస్ చైర్మన్ లింగాల భిక్షం, మాజీ ఎంపీపీ ధ్యాప కృష్ణారెడ్డి, నాయకులు ఈరసరపు యాదగిరి గౌడ్, నూనెముంతల వెంకటేశ్వర్లు, కుమ్మరికుంట్ల రాజరత్నం, ఇమ్మడి దశరథ, చిందం ప్రకాశ్, గడ్డమీది పాండరి, గూడ రవీందర్, నాయకులు ఉన్నారు.

323 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్ షా లోమ్

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 12 : జిల్లాలో 323 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేపట్టినట్లు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి. బెన్ షా లోమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 85 ఐకేపీ కేంద్రాలు, 225 పాక్స్ కేంద్రాలు, 13 ఎఫ్‌పీఓల ద్వారా కొనుగోళ్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 32 కేంద్రాల ద్వారా 168 మంది రైతుల నుంచి 29 కోట్ల విలువ చేసే 1330 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్నీ సంచులు, టార్పాలిన్లు ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలని కోరారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు సకాలంలో రవాణా చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు, కొనుగోలు అనంతరం రైతుల ఖాతాలలో సకాలంలో డబ్బులు జమ చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

మే 3 నుంచి గ్రామ దేవతల పండుగలు

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 12 : మండల కేంద్రంలో మే 3 నుంచి 5 వరకు గ్రామదేవతల పండుగలు నిర్వహించాలని అఖిలపక్షనాయకులు, ప్రజాప్రతినిధులు, కులసంఘాల నాయకులు నిర్ణయించారు. శుక్రవారం గ్రామంలో జరిగిన సమావేశంలో వారు ఈ మేరకు తీర్మానించారు. మే 3న శివపార్వతుల కల్యాణం, 4న రథోత్సవం ఊరేగింపు, 5న మారెమ్మ, ముత్యాలమ్మ, ఎల్లమ్మ, పోచమ్మ, కట్టమైసమ్మ, సాగుబావి మైసమ్మ, కనకదుర్గమ్మకు బోనాలు సమర్పించాలని, బొడ్రాయికి నీళ్లు పోసే కార్యక్రమం చేపట్టాలని నిర్ణంచారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పంచముఖ రామలింగేశ్వరుడి ఆలయ బ్రహ్మోత్సవాలు షురూ

వలిగొండ, ఏప్రిల్12: మండలంలోని వెంకటాపురం గ్రామ పరిధిలోని మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం కొండపై కొలువైన పార్వతీ సమేత పంచముఖ రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమైయ్యాయి. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యము, గోపూజ, అఖండ దీపారాధన, దీక్షాధారణ, మండపారాధన నిర్వహించినట్లు ఈఓ మోహన్‌బాబు తెలిపారు. వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ యువమోర్చా జిల్లా అధికార ప్రతినిధిగా శ్రీను

సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 12 : బీజేపీ యువమోర్చా జిల్లా అధికార ప్రతినిధిగా మండలంలోని గుజ్జ గ్రామానికి చెందిన ఎలిజాల శ్రీను ఎన్నికయ్యాడు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్, ప్రధాన కార్యదర్శి దిండు భాస్కర్ శుక్రవారం శ్రీనుకు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

'బీజేపీతో దేశానికి ప్రమాదం'

చౌటుప్పల్‌రూరల్, ఏప్రిల్ 12 : కేంద్రంలో మోదీ పాలనలో దేశంలోని ప్రభుత్వ సంస్థలు కార్పొరేట్ పరమయ్యాయని, బీజేపీతో దేశానికి ప్రమాదం పొంచి ఉందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పంతంగిలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

నేడు పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం

- బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలి
- ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

రాజాపేట, ఏప్రిల్ 12 : ఆలేరులోని ప్రకాశ్ గార్డెన్‌లో శనివారం జరిగే భువనగిరి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున్న తరలి రావాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆలేరు మండలంలో ప్రకాశ్ గార్డెన్‌లో నిర్వహించిన రాజాపేట మండల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. భువనగిరి ఖిలాపై ఎగిరేది గులాబీ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున్న పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో ఎంపీపీ గోపగాని బాలమణీయాదగిరిగౌడ్, జడ్పీటీసీ చామకూర గోపాల్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చింతలపూరి భాస్కర్‌రెడ్డి, మదర్‌డెయిరీ డైరెక్టర్ చింతలపూరి వెంకట్‌రాంరెడ్డి, బీఆర్ఎస్ సెక్రెటరీ జనరల్ సందిల భాస్కర్‌గౌడ్, మాజీ సర్పంచులు గుంటి మధుసూదన్‌రెడ్డి, బూర్గు నర్సింహారెడ్డి, నాగిర్తి గోపిరెడ్డి, రాంచంద్రారెడ్డి, నాయకులు సట్టు తిరుమలేశ్, రామిండ్ల నరేందర్, ఉప్పలయ్యగౌడ్, జశ్వంత్, బాలస్వామి పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

బొమ్మలరామారం : బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు మద్దతుగా శుక్రవారం ఆలేరులో నిర్వహించే నియోజకర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు పొలగాని వెంకటేశ్‌గౌడ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ గూదె బాలనర్సయ్య, జూపల్లి భరత్, కట్ట శ్రీకాంత్ గౌడ్, బండి మహేశ్ గౌడ్, బెజ్జంకి పాపిరెడ్డి, భేతాళ పాండు పాల్గొన్నారు.


కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీరప్ప కల్యాణానికి రండి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పార్టీ నాయకుల ఆహ్వానం

రాజాపేట, ఏప్రిల్ 12 : మండలంలోని దూదివెంకటాపురంలో ఈ నెల 17 నుంచి 19 వరకు నిర్వహించే బీరప్ప కల్యాణ మహోత్సవాలకు రావాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను పార్టీ మండల నాయకులు కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో వారు మాజీ మంత్రిని కలిసి ఆహ్వాన ప్రతికను అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యకుడు తుంగబాలు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నక్కిర్తి కనకరాజు, నాయకులు పాల్గొన్నారు.

చందేపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాసులను పరిశీలిస్తున్న ఏడీఏ పద్మావతి

నాణ్యమైన ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలి

- ఏడీఏ పద్మావతి

మోటకొండూర్, ఏప్రిల్ 12 : రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని ఏడీఏ పద్మావతి సూచించారు. శుక్రవారం మండలంలోని చందేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ధాన్యం నిల్వ, ధాన్యం కొనుగోలుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట ఏఓ సుబ్బూరి సుజాత, ఏఈఓ దేవరకొండ శివాణి, కేంద్రం ఇన్‌చార్జి నర్సింహ ఉన్నారు.